# అకారణంగా జరిగిన బదిలీ

అస్సాములో ఆ మిలిటరీ యూనిట్‌కి కమాండెంట్‌గా కల్నల్ రఘువీర్‌సింగ్ వస్తున్నాడని వినగానే, ఆ యూనిట్ వారందరికీ గుండెదడ ఎక్కువైంది. ఆ యూనిట్లో ఉన్న సర్దార్జీల మొత్తం సంఖ్య పన్నెండు. వాళ్ళకి మాత్రం గుండెదడ కలగలేదంటే దానికి కారణం, వాళ్ళకి గుండెకాయలు లేవని గాదు, రఘువీర్‌సింగ్‌కి స్వమతస్థుల పట్ల ప్రత్యేక అభిమానముందని, అతను అక్కడికి చేరేలోగానే మేఘసందేశం ద్వారా గాని, మరుత్‌సందేశం ద్వారా గాని వాళ్ళకు తెలిసినట్లుంది. అది మరుత్ సందేశం కంటే మేఘ సందేశమే అయ్యుండాలి. ఎందుకంటే, ఏ మేఘానికి ఇష్టముండదు, మేఘాలయకి వెళ్ళడానికి?

ఈ కల్నల్ రఘువీర్‌సింగ్ గురించి ఉన్న కింవదంతులు – సాక్షాత్తూ శ్రీరామ చంద్రుడిలాగా ఇతనికి కూడా ఒకేమాట, ఒకే బాణం, ఒకే పత్ని అనే జబ్బున్నట్లు, ఒరిజినల్ రఘుకుల తిలకుని కంటే మించిన వీరుడు కావడం వలన, ఇతని ముఖారవిందంలో డోబర్‌మెన్‌తో ధీటైన క్రౌర్యం, శౌర్యం, కనబడుతాయన్నట్లు.... నిబంధనలు, చట్టాలు మొదలైన వాటిని తు.చ. తప్పకుండా పాటిస్తాడని... క్రమశిక్షణ విషయంలో ఏమాత్రం వెసులుబాటు ఇవ్వడని..... డ్రిల్లు, పరేడ్, హాకీలలో అతని నిర్ణయమే వేదవాక్కుగా పరిగణిస్తాడని.... ఇత్యాది, ఇత్యాది.

ఒక సుదినాన, ఆ రఘువీరుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. రాగానే అతను ఆ కాంపస్‌ని ఎలక్ట్రిఫై చేయడం మొదలు పెట్టాడు. అంటే, ఆ కాంపస్‌లో అంతవరకూ ఎలక్ట్రిసిటీ లేదని కాదు, దాని అర్థం. ఆ వీర శూరపరాక్రముడికి కింద పనిచేసే వాళ్ళందరికే కాక, ఆ పరిసరాలకి కూడా అతను ఒక హైవోల్టేజీ విద్యుత్తీగలా ఉంటాడన్నమాట. అతన్ని చూస్తేనే అందరూ భయపడిపోతారు. అతని కంఠ స్వరం వింటేనే అందరూ వణికిపోతారు. అతను వస్తున్నాడన్న వార్త వింటేనే వారి గుండెదడ ఎక్కువవుతుంది. సిబ్బందిని గజగజ వణికిస్తూ ఇబ్బంది పెట్టడం అతనికి ప్రియమైన ఒక వినోదం. కానీ అతని కింద పనిచేసే ఏ సర్దార్జీనైనా చూస్తే మాత్రం, "ఏం సోదరా! నీ పేరేమిటి? నీ స్వగ్రామమేటి? నీ తల్లిదండ్రులు క్షేమంగా ఉన్నారా? మీకు ఎంతమంది అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు? వాళ్ళందరూ ఏమేం చేస్తున్నారు? నీకు పెళ్ళయిందా? నీ భార్యా, పిల్లలూ, నీతో ఇక్కడ ఉన్నారా? నీ పిల్లలు ఏయే క్లాసులలో చదువుతున్నారు? వాళ్ళు బాగా చదువుతారా? మీకు ఇక్కడ ఏమయినా ఇబ్బందులు గానీ కష్టాలు గానీ ఉన్నాయా? ఏమయినా ఉంటే, మీరు నా ఆఫీసుకి గాని ఇంటికి గాని వచ్చి

చెప్పవచ్చు" అని ఎంతో సుహృద్భావంతో మాట్లాడతాడు. ఆ విధంగా అక్కడున్న కొంతమంది సర్దార్జీలు ఆయన బంధువులుగా మారారు. మిగతా అందరిమీదా అతనికి రహస్య రిపోర్ట్‌లు సమర్పించేది ఆ డర్టీ డజన్ సభ్యులే.

రఘువీర్ రోజూ తెల్లవారుఝామునే లేస్తాడు. యూనిఫామ్ వేసుకుని, అతను తన కార్లో పరేడ్ గ్రౌండ్‌కు పహుంచ్‌తాడు. డ్రిల్లులో, పరేడ్‌లో తప్పుల్ని పట్టడం, వాటిని సరిదిద్దడంలో అతను అతి సమర్థుడు. అతను తన యూనిఫామ్‌ని ఎంత చక్కగా ఉంచుకుంటాడో, అలాగే తన కింది ఉద్యోగులను కూడా ఉంచుకోవాలంటాడు. పగలంతా తన ఆఫీసులో చతికిలపడి ఉండకుండా కాంపస్ ఇన్‌స్పెక్షన్ అనే కార్యక్రమంలో అతను ఎక్కువ కాలం గడుపుతుండేవాడు. అతని అధికార పరిధిలో ఎక్కడా కూడా శుచిగాలేని, అందంగాలేని వస్తువు ఒక్కటైనా ఉండకూడదు. ఎక్కడా ఒక ఎండుటాకు కనిపించకూడదు. బోగన్‌విల్లా మొక్కలంటే అతనికి ఎంతో ప్రీతి. కొన్నాళ్ళయ్యేసరికి, ఆ కాంపస్‌లో ఎటు చూసినా బోగన్‌విల్లానే... వివిధ రంగులలో, వివిధ రకాలలో.

సాయంత్రాలలో అందరూ ఏదయినా ఉత్తేజకరమయిన ఆటలు ఆడాలనే పట్టింపు అతనికి ఉండేది. కానీ, అన్ని ఆటలలోనూ అతనికి అత్యంత ఇష్టమైనది హాకీ. ఇండియన్ హాకీటీమ్ తన కంట్రోల్లో ఉండి ఉంటే ఒక్కసారి కూడా ఆ క్రీడల్లో ఒలింపిక్ బంగారం పాకిస్తాన్‌కి పోయేది కాదని అతని ప్రగాఢ విశ్వాసం.

మెస్‌లో కూడా, అతని ప్రవర్తన ఘనగంభీరంగా ఉంటుంది. అతను రోజూ మెస్‌కి వెళ్ళేవాడు కాదు. మామూలుగా వారానికి రెండుసార్లు అతను తన భార్యతో కలిసి మెస్‌కి వెళ్ళేవాడు. ఆ రోజుల్లో మిగతా ఆఫీసర్లందరూ సతీ సమేతంగా రావాలని అతని అలిఖిత నిర్దేశం. ఆరు పెగ్గుల వరకూ అతను హాయిగా లాగించేస్తాడు. అతని సతీమణి నాలుగు పెగ్గులకు తక్కువ తీసుకొనేది కాదు. ఆ తరువాత, వాళ్ళిద్దరూ హాయిగా భోజనం చేస్తారు. అతను మెస్‌కి వెళ్ళేటప్పుడు, మాంఛి టిప్‌టాప్‌గా డ్రెస్ చేసుకుంటాడు. మెస్ నిబంధనల ప్రకారంగా అందరూ డ్రెస్ చేసుకోవాలని అతనికి మహా పట్టుదలగా ఉండేది. కుర్ర ఆఫీసర్లు ఎక్కువ తాగడం అతనికి నచ్చేది కాదు. రహస్యంగా వాళ్ళ మెస్సు బిల్లులు తెప్పించి అమితంగా త్రాగేవాళ్ళకు అతను తాఖీదులిచ్చేవాడు.

ప్రతివారం రెండు మూడుసార్లు, వేరే మిలిటరీ క్లబ్బులకి గానీ, ప్లాంటర్స్ క్లబ్బులకి గానీ వెళ్ళేవాడు. కానీ, సాయంత్రపు షికార్లకి అతను భార్య లేకుండా వెళ్ళేవాడు కాదు.

బయట ఎంతో పెద్దపులిలా ఉండే అతను, ఇంట్లో మాత్రం ఒక పిల్లిలా ఉండేవాడు.

పత్నీహితానికి విరుద్ధంగా అతను ఏమీచేసేవాడు కాదు. ఆమె వదనంపై కారుమేఘాలు కమ్మాయంటే అతనికది దుర్భరం. ఆప్తమిత్రులతో అతను అప్పుడప్పుడూ ఇలా అంటుండేవాడు. "ఒక్క సర్దారిణీని మచ్చిక చేయడం ఎంతో కష్టమైనపని. కానీ ఆమెని రెచ్చగొట్టడం ఎంతో సులభం. కుపితురాలైన ఒక సర్దారిణీని అభిముఖీకరించడం కంటే యుద్ధభూమికి వెళ్ళడమే తక్కువ ప్రమాదకరం" నిజానికి అతను అలా నమ్ముతున్నాడేమో!

వాళ్ళకు ఇరవైమూడు, ఇరవై ఒక్క సంవత్సరాలు గల ఇద్దరు కూతుళ్ళు వున్నారు. పెద్దమ్మాయి ఎం.బి.బి.యస్. పాసయ్యి ఒక ఎమ్.డి. డాక్టర్‌ని పెళ్ళాడి చండీగఢ్‌లో ఉంటోంది. రెండో అమ్మాయి ఢిల్లీలో మెడిసిన్ ఫోర్త్ ఇయర్ చదువుతోంది. అందుకే, చిన్నపిల్లల న్యూసెన్స్‌గాని, పెద్దపిల్లల చదువు, చట్టుబదండల బాధ్యత గానీ, వాళ్ళకు లేవు. ఏ ప్రదేశానికి బదిలీ అయినా, ఆ సర్దార్జీ, సర్దారిణీలకు బాధలేదు. వాళ్ళు ఎంతో సంతోషంగా, పూర్తిగా ఇష్టపడి వెళ్తారు. కొత్త ప్రదేశాలు చూడటం, క్రొత్త పరిచయాలు చేసుకోవడం వాళ్ళకు చాలా ఇష్టం. పిల్లలు స్కూల్లో చదువుకునేటప్పుడు వాళ్ళ దగ్గరే ఉన్నారు. కానీ, చదువులో చురుకైన వాళ్ళు కావడంతో తల్లిదండ్రుల సోషల్ ఈవెనింగ్‌లకు ఎలాంటి అడ్డంకులూ సృష్టించలేదు.

ఇదివరలో అతను అస్సాములోనే మరొక స్టేషన్‌లో మేజరుగా పనిచేయడం వలన ఈ సారి స్టేషన్ కమాండర్‌గా అక్కడికి రావడం వాళ్ళకి ఎంతో ఆహ్లాదాన్ని కలిగించింది.

ఆ దంపతులిద్దరూ, అలా సంతోషంగా రోజులు గడుపుతున్నారు. కానీ, ఆ సైన్య స్థావరాలు, పరిసరాలు రోజు రోజుకి కనువిందుగా తయారయ్యాయి. కానీ, అక్కడ సర్దార్జీలు తప్పనితర కమిషన్డ్ ఆఫీసర్లకు, జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లకు మరియు నాన్ కమిషన్డ్ ఆఫీసర్లకు అందరికి వాళ్ళు తలపైన బాంబు వేలగట్టినట్లుగా అనిపించింది. ఏవేళ, ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఏం జరుగుతుందోనని వాళ్ళకు ఆందోళనగా ఉండేది. డిసిప్లిన్ విషయంలో ఎటువంటి పనిష్మెంట్ ఇవ్వడానిక్కూడా వెనుకాడని వ్యక్తి, ఆ కల్నల్ రఘువీర్. అందుకే, అతనికి ఎప్పుడు ట్రాన్స్‌ఫర్ వచ్చినా ఘనమైన వీడ్కోలు ఏర్పాటు చేయడానికి ఆ యూనిట్లో అకేశవులందరూ సిద్ధంగా ఉండేవారు. కానీ, మూడు సం॥ల లోపల అతనికి బదిలీ కావాలంటే స్పెషల్‌గా దేవుడి దయ ఉంటేనే అవుతుంది. అప్పుడప్పుడు సెలవురోజులలో రఘువీర్‌సింగ్ కార్లో ఒంటరిగా ఎటో అటువైపు వెళ్తుండేవాడు. అతి రహస్యమైన కొన్ని ఉద్యోగ విషయాల్లోనే అలా వంటరిగా వెళ్ళవలసి వస్తుందని భార్యతో చెబుతుండేవాడు. ఆ సర్దారిణీ తన సర్దారు, ఆ ఊరికే రాజని పొంగిపోతుండేది. ఆ ఊరి సామాన్యజనంతో సంబంధాలు పెట్టుకోవడం అతనికి అవసరమే లేదన్న విషయం ఆ సర్దారిణీమణికి తెలియదు. గతంలో పనిచేసిన

స్టేషన్లలో కూడా అతను అప్పుడప్పుడు వంటరిగా అలా వెళ్ళేవాడు కాబట్టి, అలాంటి ఔటింగ్స్‌లో ఎటువంటి అపాయంకానీ, అసమంజసం కానీ ఉంటుందని ఆమె ఊహించుకోలేదు. కానీ, అస్సాములోని కొన్ని ప్రదేశాలలో తీవ్రవాదుల కార్యకలాపాలు జరుగుతున్న విషయం గురించి ఆమె అతన్ని హెచ్చరించింది.

"ఏమంటున్నావు? ఒక కల్నల్ వంటిమీద చెయ్యివేసే ధైర్యం ఎవరికన్నా ఉందా? దిసీజ్ ఇండియన్ ఆర్మీ డార్లింగ్! దిసీజ్ ఇండియన్ ఆర్మీ!"

పతిదేవుడి పౌరుషపు పలుకులు విన్న ఆ సర్దారిణీకి భారతీయ సైన్యపు శక్తిసామర్థ్యాల గురించి ఉత్తేజపూరితమైన రోమహర్షం కలిగింది.

ఏకపత్నీవ్రతుడైన ఆ రఘువీర్‌సింగ్, ఒక సెలవురోజు ఆ విధంగా వంటరిగా బయటకు వెళ్ళి మధ్యాహ్నం భోజనానికి తిరిగి రాలేదు. అలా ఆలస్యం కావటం, అపుడపుడు, సాయంత్రం వరకు రాకుండా, వుండటం, అసాధారణం కాకపోవడం వలన రాత్రి ఏడుగంటలయ్యేటప్పుడు, ఆ సర్దారిణీకి కొద్దిగా గుబులు మొదలయ్యింది. ఆ సాయంత్రం ఒక ప్లాంటర్స్ క్లబ్బుకి వెళ్ళాలని అనుకున్నారు కూడా. ఎనిమిదిన్నరకు రఘువీర్‌సింగ్ తిరిగి వచ్చాడు. అతని కారుని ఎస్కార్ట్‌చేస్తూ, ఒక మిలిటరీ కారు కూడా వచ్చింది. ఆ ట్రక్కు మరేదో యూనిట్‌కి చెందినది. ఆ యూనిట్ జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్ రఘువీర్ సింగ్‌కి సెల్యూట్ చేసి శెలవు తీసుకున్నాడు.

సర్దారిణీ భయపడిపోయింది. భర్తవంటిమీద బట్టలన్నీ పీలికలైపోయి ఉన్నాయి. మనిషి చాలా అలసిపోయినట్లుగా వివర్ణంగా ఉన్నాడు. అతని శరీరమంతా దెబ్బలూ, రక్కులూ ఉన్నట్టు కూడా ఆమెకి అర్థమైంది.

"నేనొక టాప్ సీక్రెట్ మిషన్ మీద వెళ్తున్నట్టు నీకు చెప్పాను కదా! ఒక పల్లెటూర్లో, నిరక్షరకుక్షులైన కొంతమంది రౌడీలకు ఆర్మీవెహికల్ చూస్తే కూడా అర్థం కాలేదు. వాళ్ళు నన్నొక చెట్టుకు కట్టిపడేసారు. దానిని నేను కొంచెం ఎదుర్కోవడం వలన, దెబ్బలు కూడా తగిలాయి. చివరకు ఈ ఆర్మీ ట్రక్కు ఆ దారిలో రావడం వలన నా కారు చూసి వాళ్ళు దాని గురించి వాకబు చేసారు. ఆ విధంగా, నేను ప్రమాదం నుంచి బయటపడ్డాను. ఇంతటితో సరిపోతే ఫర్వాలేదు. మా మిలిటరీలో కొంతమంది పుకారు రాయుళ్ళుంటారు కదా! వాళ్ళలో ఎవరయినా దీనికి చిలువలు, పలవులు చేర్చి హెడ్‌క్వార్టర్స్‌కి పంపిస్తారేమోనని నా భయం. కానీ, నీకు తెలుసు కదా, నేను ఎవరికీ, దేనికీ భయపడనని, ఎవరెన్ని కథలు సృష్టించినా, నా డార్లింగ్ మాత్రం నమ్మకూడదని, నా కోరిక" అని చెపుతూ, అతను ఆమెని గాఢాలింగనంలో

బంధించినప్పుడు, అతని గుండెల్లోంచి గద్గదనాదాలు వెలువడ్డాయేమోనని ఆ సర్దారిణీకి అనుమానం కలిగింది.

మరుసటి రోజు కొన్ని స్థానిక వార్తాపత్రికలలో, పెద్ద పెద్ద అక్షరాలతో ఒక వార్త ప్రచురితమైంది. ఆ వార్తలో కల్నల్ రఘువీర్‌సింగ్‌పేరు మాత్రం ప్రస్తావింపబడలేదు. ఒక మిలట్రీ ఆఫీసర్ ఫలానా గ్రామానికి వంటరిగా వెళ్లాడని, ఒక బీద యువతిని వలలో వేయడానికి ప్రయత్నించాడని, అది చూసిన కొంతమంది స్థానిక యువకులు అతన్ని బాగా దేహశుద్ధిచేసి, రోడ్డు ప్రక్కనున్న దీపస్తంభానికి కట్టిపడేసారని, సాయంత్రం ఆ దారినవెళుతున్న ఒక మిలటరీ పార్టీ అతన్ని విడిపించి తీసుకు వెళ్ళారనేది ఆ వార్తంలోని సారాంశము. అది కాకుండా, ఇలాంటి పాడుపనులు ఆ ఆఫీసర్ తన నిత్య వినోదంగా చేసుకున్నాడని, ఆ ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో, అతను అమాయకులైన కొంతమంది అమ్మాయిలని, వేటాడటం వలన ఆ గ్రామవాసులు పట్టరాని కోపంతో ఉన్నారని కూడా ఆ వార్తలో వెల్లడైంది. భార్యకి ఆ న్యూస్ చూపించి "చూశావా డార్లింగ్! నేను నీకు ముందుగానే చెప్పాను కదా! ఇవన్నీ మా కోలీగ్స్ సృష్టించినవే. ఏ మాత్రం అవకాశం దొరికినా, వాళ్ళు ఎంతో వేగంగా పేపర్లవాళ్ళని కూడా పట్టేస్తారు. దీనీమీద ఇంటలిజెన్స్ రిపోర్టు ఢిల్లీకి కూడా వెళ్ళి ఉంటుంది." అని చెపుతూ తన మీసాలని కంపింపజేస్తూ ఒక దీర్ఘ నిట్టూర్పు వదిలాడు. కానీ, ఈసారి మాత్రం భార్యని గాఢాలింగనం చేసుకోవాలని అనిపించలేదు.

అతను చెప్పిన మాటలన్నీ ఆమె ఎంతవరకు నమ్మిందో గానీ, ఆమెకి మనసులో ఆవగింజంత అనుమానమైనా కలిగి ఉంటుంది. కానీ, మిలట్రీ హెడ్ క్వార్టర్స్‌లో మాత్రం ఆ అనుమానం అణుబాంబై మూడు రోజుల్లో బదిలీ ఆర్డర్ ఒక నిస్తంత్రీ ఉత్తరువుగా, ఆ సర్దార్జీ నెత్తిమీద వచ్చిపడింది. తన సెకండ్-ఇన్-కమాండ్‌కు బాధ్యతలు అప్పజెప్పి రఘువీర్‌సింగ్ అదే రోజు పలాయనం చిత్తగించాడు. ప్యాకింగ్‌లాంటి తదుపరి కార్యక్రమాలు ముగించుకొని అక్కడినుండి వెళ్ళడానికి మిసెస్ రఘువీర్‌సింగ్‌కి రెండు, మూడు రోజులు పట్టింది. ఎంతో ఘనంగా రఘువీర్‌సింగ్‌కి వీడ్కోలు ఇవ్వాలనుకొన్న ఆ యూనిట్‌వాళ్ళ కోరిక మాత్రం సఫలీకృతం కాలేదు.